

కుప్పంలో తమ్ముళ్ల దందాలు

సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని టీడీపీ శ్రేణులు స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చేశారు. - 8లో



నిమజ్జనం.. పులకించిన భక్తజనం

తిరుపతి జిల్లావ్యాప్తంగా ఐదోరోజు గణనాథుడి ప్రతిమలను ఊరేగింపుగా తెచ్చి నిమజ్జనం చేశారు. - 8లో



బరి తెగించిన టీడీపీ నేతలు

చిన్నగొట్టిగల్లు మండల్ మీట్ జరగకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఎంపీపీపై దాడికి యత్నిస్తే, పోలీసులు అడ్డుకున్నారు. - 8లో

సాక్షి తిరుపతి

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

11 అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులుగా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. జిల్లాలోని ఏడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, వీటిలో 11 గెస్ట్ టీచర్ల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనకు గెస్ట్ టీచర్లను తీసుకుంటున్నామని, బీఈడీతోపాటు టెట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. అంతేకాకుండా పీజీలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరేట్‌లోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు నాయుడుపేట సమీపంలోని బిరదవాడ వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో డెమో ఉంటుందని, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. గెస్ట్ టీచర్ల పోస్టులకు సంబంధించి స్త్రీల విభాగంలో జూనియర్ లెక్చరర్లు(కెమిస్ట్రీ)-01, అర్థికశాస్త్రం-01, కామర్స్ -01, హిందీ-01, మ్యాథ్స్-02, సోషియల్ స్టడీస్-02, పురుషుల విభాగంలో జేఎల్‌గా మ్యాథ్స్-01, పీజీటీ మ్యాథ్స్-01, హిందీ-01 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు.

పోలేరమ్మ జాతరకు చాటింపు

– ఉత్సాహంగా పాల్గొన్న యువత



పోలేరమ్మ జాతర నిర్వహణకు మొదటి చాటింపు వేస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి రూరల్: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మ జాతర మొదటి చాటింపు వెంకటగిరి పట్టణంలో బుధవారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తొలుత కాపొళెంలోని గాలిగంపుల పోలేరమ్మ తల్లి, అనంతరం కామక్షమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మ తల్లి జాతరకు మొదటి చాటింపు అంటూ జాతర పనిబాపన వాళ్లు చాటింపు వేశారు. ఈ వేడుకల్లో యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని 'జై పోలేరి.. జైజై పోలేరి' అంటూ కోలాహలం చేశారు. కాంపాళెంలోని ప్రధాన మార్గం గుండా వరదరాజస్వామి దేవస్థానం, బజారువీధి మీదుగా పోలేరమ్మ తల్లి ఆలయం, ఆర్చి, కాశీపేట కూడలి మీదుగా పోలేరమ్మ జాతర నిర్వహణకు సంబంధించి చాటింపు వేశారు. ఈ మేరకు వెంకటగిరి గ్రూప్ దేవస్థానం ఈఓ శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

15 వరకు డిగ్రీ మూడవ విడత కౌన్సెలింగ్ పొడిగింపు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో మూడవవిడత డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 15వ తేదీ వరకు పొడిగిస్తూ అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు ఉన్నత విద్యామండలి బుధవారం సమాచారం అందించింది. ఈనెల 18 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించి, 19న వెబ్ ఆప్షన్ల మార్పు చేసుకునేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది.

పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : పులివెందుల మెడికల్ కళాశాలకు మూడవ విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులివెందుల మెడికల్ కళాశాలకు జాతీయ మెడికల్ కౌన్సిల్ అనుమతులు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సీట్లు కేటాయించవద్దని ఎన్‌ఎంసీకి లేఖ రాయడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు కోచింగ్ కోసం రూ.లక్షలు చెల్లించి, ర్యాంకులు సాధిస్తే నేడు సరిపడా సీట్లు లేక ఇతర దేశాల్లో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లాల్సి రావడం బాధాకరమని తెలిపారు.

రూ.10 నాణేలకు మోక్షం

తిరుపతి అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు జారీ చేసిన పదిరూపాయిల కాయిన్స్(నాణేలు)ను ప్రయాణికుల నుంచి ఆర్టీసీ కండక్టర్లు తప్పక తీసుకోవాలని ఆర్టీసీ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేటర్స్)చంద్రశేఖర్ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజర్వ్ బ్యాంక్ 14 రకాల పది రూపాయిల నాణేలను విడుదల చేసినట్లు స్పష్టం చేశారు. పెద్దఎత్తున ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలోనే వాటిని తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆదేశాలు జారీచేశారు.

ఎట్టకేలకు మోక్షం..

పది రూపాయిల కాయిన్స్ 14 రకాలు ఉండడంతో ఏది నిజమైన నాణెమో, ఏది డూప్లికేటో తెలియక వ్యాపారులు తీసుకోవట్లేదు. అయితే ఆర్టీసీ నుంచి వచ్చిన ఉత్తర్వులు భరోసా కల్పించాయి. దీంతో పది రూపాయిల నాణేలకు మోక్షం వచ్చిందని అంతా భావిస్తున్నారు.

ఇసుక లేక ఖాళీగా దర్శనమిస్తున్న వెంకటగిరి ఇసుక రీచ్



ఉచిత ఇసుక.. ఎక్కడా దొరక్క..



ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక ఉచితమని చెబుతున్నా.. పేద, మధ్య వర్గాల ప్రజలకు మాత్రం ఇసుక మరింత ప్రియమైంది. ఉచితం మాట దేవుడెరుగు కూటమి ప్రభుత్వం తెచ్చిన కొత్త పాలసీని అడ్డుపెట్టుకుని ఆయా పార్టీల నేతలు కాసుల పంట పండించుకుంటున్నారు. ఇసుక కొరతతో సగటు సామాన్యులు ఇంటి నిర్మాణ పనులు ఆపేస్తుంటే, మరోవైపు భవన నిర్మాణ కార్మికులు సైతం పనుల్లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతి జిల్లాలో చాలాచోట్ల ఇసుక దొరక్క ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి.

- అర్ధంతరంగా ఆగుతున్న భవన నిర్మాణాలు
- పనుల్లేక పస్తులు ఉంటున్న భవన నిర్మాణ కూలీలు
- పరిశ్రమలకు మాత్రం టిప్పర్లలో తరలుతున్న ఇసుక
- పేద, మధ్య తరగతి వర్గాల వారికి మాత్రం దొరకని వైనం
- వెంకటగిరిలో ఖాళీగా కనిపిస్తున్న స్టాక్ పాయింట్
- కైవల్యానది నుంచి అక్రమంగా తరలిపోతున్న తెల్లబంగారం
- రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న కూటమి నేతలు
- నెల మామూళ్ల మత్తులో అధికారులు, పోలీసులు

చిల్లకూరు : జిల్లావ్యాప్తంగా ఇసుక ఉచితం అని మాట వరసకే తప్పా ఎక్కడా సామాన్యుడికి దొరికే పరిస్థితి లేదు. గత ప్రభుత్వ హయాంలో అందరికీ అందుబాటులో ఉండే ఇసుక ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా పార్టీల నేతలు జేబులు నింపుతోంది. సగటు పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక దొరకకుండా కృత్రిమ కొరత సృష్టించి కూటమి పార్టీల నేతలు అధిక సొమ్ముకు విక్రయించి పేదల కడుపుకొడుతున్నారు. గూడూరు నియోజకవర్గంలోని వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నా అక్కడ తవ్వకాలు చేపట్టకుండా సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్లి టన్నుకు డబ్బులు చెల్లించి తెచ్చుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో అక్కడ కొనడంతో పాటు బాడుగతో కలిపితే ఇసుక తడిసి మోపెడవుతోంది. గూడూరులో భవన నిర్మాణ పనులకు చుట్టుపక్కల నుంచే కాకుండా పట్టణంలోని వారితో పాటు ఇటీవల కాలంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు రోజు వారి పనుల నిమిత్తం సుమారు 1000 మంది వరకు వెళ్తుంటారు. వీరు మసీద్ సెంటర్, సాదూపేట సెంటర్, జీఎస్‌రాయు సెంటర్ ప్రాంతాల్లో ఉంటారు. వీరిని మేస్త్రీలు ఎంపిక చేసుకుని పనులకు తీసుకెళ్తారు. గతంలో ఒక మేస్త్రీ కనీసం పది కూలీలతో పనులు చేయించేకునేవారు. ప్రస్తుతం ఇసుక దొరక్క ఒక మేస్త్రీ ఇద్దరు ముగ్గురు కూలీలతో పనులు చేయిస్తున్నారు. దీంతో చాలామంది పనులు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. అలాగే భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. మరోవైపు సిమెంటు, ఇనుము, ఇతరత్రా వ్యాపారాలు నెమ్మదించాయి.



తెలుగు తమ్ముళ్లకు కాసుల పంట

గూడూరు నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లకు ఇసుక కాసుల వర్షం కురిపిస్తోంది. రాత్రయితే వారికి పండుగే. ముఖ్యంగా వాకాడు, కోట, చిట్టమూరు మండలాలతో పాటు గూడూరు రూరల్‌లో విందూరు, సైదాపురానికి వెళ్లే మార్గంలోని కైవల్యానది ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తంతు కళ్లెదుటే జరుగుతున్నా, ఎవరికి అందాల్సిన ముడుపులు వారికి అందుతుండడంతో ఏ ఒక్క అధికారి కూడా ఇసుక అక్రమ తరలింపును ఆపడం లేదు.



పనుల కోసం వేచి ఉన్న భవన నిర్మాణ కూలీలు

ట్రాక్టర్ ఇసుక రూ.8 వేలు..

ప్రభుత్వం ఇసుక ఉచితమని చెప్పడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇంటి నిర్మాణ పనులను త్వరగా చేసుకోవచ్చని అనుకున్నారు. అయితే పని చేయించుకోవాలంటే ముందుగా ఇసుక అవసరమని వెళ్తే ఒక ట్రాక్టర్ ఇసుకను రూ.8 వేలకు తోలుతామని ట్రాక్టర్ యజమానులు చెబుతూ అది కూడా ఆ గ్రామంలో ఉన్న టీడీపీ నాయకుడి అనుమతి కావాలని అడుగుతున్నారు. దీంతో అంత డబ్బు ఇచ్చుకుని కూడా నాయకుల వద్దకు వెళ్లడం ఎందుకని మిన్నకుండి పోతున్నారు.

పట్టుకునేది ఒకటి.. పక్కన వెళ్లేవి ఎన్నో..!

ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే అధికారులు ఆ రోజు కాస్త హడావుడి చేసి ఒక ట్రాక్టర్ పట్టుకుంటారు. అయితే పక్కన పది ట్రాక్టర్లను వదిలేస్తున్నారు. ఇటీవల కాలంలో చిట్టమూరు, కోట, గూడూరు రూరల్ ప్రాంతాల్లో పట్టుకున్న ట్రాక్టర్లకు స్టేషన్‌లో మామూళ్లు కట్టాలని హుకుం జారీ చేస్తే కొంత మంది అంత పెద్ద మొత్తాల్లో తాము కట్టలేమని, ఇసుక తరలింపును నిలిపి వేసుకున్నట్లు తెలిసింది. ఎవరి ట్రాక్టర్ అయినా పోలీసులకు పట్టుబడితే కేసు రాయకుండా వదిలేందుకు రూ.10 వేల వరకు ముట్టజెప్పాలి. అయితే తమ అధీనంలో ఇసుక తరలించే ట్రాక్టర్లకు మాముళ్లు ఎందుకు చెల్లించాలని తెలుగు తమ్ముళ్లు మొండికేస్తున్నారు.




అనుమతులు లేకపోవడంతో పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు



ఇసుక కొరత కారణంగా నత్తనడకన సాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులు

> **రెండు రోజులకు ఒకసారి పనికి వెళ్తున్నా..**
>
> 
>
> గత 10 ఏళ్లలో ఇలా ఇసుక దొరకకుండా పోయింది లేదు. కోవిడ్ సమయంలో పనులు లేక వెళ్లలేక పోయా. ఇప్పుడు ఇసుక పుష్కలంగా ఉన్నా దొరకడం కష్టంగా మారింది. దీంతో చిన్నచిన్న కమతాల వారు పనులు చేయించుకోలేక పోవడంతో పనులు లేకుండా పోతున్నాయి. మేస్త్రీలు అందరికీ పనులు కల్పించాలని రెండు రోజులకు ఒకసారి పనిలోకి పిలుస్తున్నారు.
>
> – రమణయ్య, భవన నిర్మాణ కూలీ, గూడూరు

> **అధికారులకు విన్నవించాం..**
>
> 
>
> ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇసుక అందక పేద, మధ్య తరగతి వారు ఇళ్ల వద్ద కనీసం చిన్న చిన్న పనులు కూడా చేయించుకోలేకపోతున్నారు. దీంతో నియోజకవర్గంలో భవన నిర్మాణ పనులు అంతంతమాత్రమే ఉంటున్నాయి. పరిశ్రమల యాజమాన్యాలకు మాత్రం ఇసుక ఎంత కావాలంటే అంత దొరుకుతుంది. పేదలకు మాత్రం దొరకదు. ఈ విషయంపై సబ్ కలెక్టర్‌తో పాటుగా స్థానిక ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించాం. అయినా ఇప్పటి వరకు స్పందన లేదు.
>
> – జోగి శివకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, గూడూరు

> **ధనవంతుల చేతుల్లోనే..**
>
> 
>
> గత మూడు నెలలుగా ఇసుక బంగారమైంది. పూర్తిగా ధనవంతుల చేతుల్లోనే ఉంటోంది. ట్రాక్టర్ ఇసుక కొనాలంటే రూ.8 వేల నుంచి రూ.10 వేలు పెట్టాల్సి వస్తోంది. అంత పెట్టి పేద, మధ్య తరగతి వారు ఇసుక కొనుగోలు చేయలేకపోతున్నారు. ధనవంతుల వద్ద మాత్రం ఇసుక నిల్వలు చాలా ఉన్నాయి. మేనకూరు, వెంకటగిరి లాంటి ప్రాంతాల్లో పరిశ్రమలకు మాత్రం టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దీనిపై ఒక్క అధికారి కూడా స్పందించరు.
>
> – పుట్టా శంకరయ్య, మేస్త్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు, గూడూరు

రూ.4 లక్షల విలువైన వైద్య పరికరాల వితరణ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా రూ.4 లక్షల విలువైన వైద్య పరికరాలను చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వితరణగా అందజేశారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇసుజు పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సెంథిల్ మనోహర్, జనరల్ మేనేజర్ తకాషి రికుకావా, శ్రీసిటీ ప్రతినిధులు నిరీషా సన్నారెడ్డి, రమేష్ కుమార్ సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు పరికరాలను అందించారు. ఈ సందర్భంగా సెంథిల్ మనోహర్ మాట్లాడుతూ తమ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా శ్రీసిటీ ప్రాంతంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇసుజు సీఎస్‌ఆర్ చొరవను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తమ సందేశంలో అభినందించారు. కార్యక్రమంలో శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.



చిన్న పాండూరు పీహెచ్‌సీకి వైద్య పరికరాలను అందజేస్తున్న శ్రీసిటీ ఇసుజు పరిశ్రమ ప్రతినిధులు

వరద బాధితులకు ఉద్యోగుల సాయం

తిరుపతి అర్బన్: వరదలతో పెద్దఎత్తున నష్టపోయిన విజయవాడ బాధితుల కోసం అధికారులు కింది స్థాయి ఉద్యోగుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని ఉన్నతస్థాయి ఉద్యోగుల ఆదేశాలతో ఆయా విభాగాల అధికారులకు ఇచ్చిన సూచనల మేరకు శాఖల వారీగా డివిజన్ అధికారులు, మండలస్థాయి ఉద్యోగుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తమ నెల జీతంలో సగం వరద బాధితులకు ఇస్తున్నట్లు పలువురు ప్రకటించారు. ఆ వెంటనే డీఆర్వో పెంచల కిషోర్ రూ.25 వేలు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి రూ.25 వేలు విరాళం అందించారు. బుధవారం వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.ప్రసాద్ రావు, ఏడీఏలు ధనంజయరెడ్డి, మనోహర్, ఏఓ గాయత్రి తదితరులు తమ శాఖ నుంచి రూ.లక్ష చెక్కును కలెక్టర్‌కు అందించారు. అదేవిధంగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ రూ.23,100 డీడీని కలెక్టర్‌కు అందించారు. అదేబాటలో పలు విభాగాలకు చెందిన అధికారులు వరద బాధితుల కోసం నగదు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. గృహ నిర్మాణశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లురావు నేతృత్వంలో ఆ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి వసూలు చేసిన రూ.లక్ష చెక్కును జిల్లా కలెక్టర్‌కు హౌసింగ్ ఉద్యోగులు అందజేశారు.





విరాళం చెక్కులను కలెక్టర్‌కు అందజేస్తున్న వ్యవసాయశాఖ ఉద్యోగులు, గృహనిర్మాణశాఖ ఉద్యోగులు

పీఎం శ్రీతో అద్భుత ఫలితాలు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



మధ్యాహ్న భోజనం తింటున్న కలెక్టర్, డీఈఓ

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం(పీఎం శ్రీ) పథకం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందని, రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో ఈ పథకం అమలు తీరు బేషుగ్గా ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కితాబిచ్చారు. మంగళవారం రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా ప్రాంగణంలోని సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆరో తరగతి విద్యార్థినులు ల్యాబ్‌లో ట్యాబ్‌లను వినియోగించి చేస్తున్న బేసిక్ గణితం లెర్నింగ్‌ను పరిశీలించారు. ఎంపీసీ సెకండియర్ విద్యార్థినులకు ఐఎఫ్‌బీ ప్యానెల్స్ వినియోగించి బోధిస్తున్న ఉపాధ్యాయురాలితో మాట్లాడారు.

టీచర్‌గా మారిన జిల్లా కలెక్టర్..

విద్యార్థినుల ఆసక్తిని గమనించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ టీచర్‌గా మారి పాఠాలు బోధించారు. సబ్జెక్ట్‌పై పట్టు ఉండేలా, దాని అప్లికేషన్ ఎక్కడ వాడతారు అనేదానిపై అవగాహన ఉంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చని వివరించారు. పాఠశాల ఆవరణలోని ఆట స్థలాన్ని పరిశీలించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అనుసంధానంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని డీఈఓ శేఖర్‌తో కలిసి తిన్నారు. అనంతరం సమగ్ర శిక్ష కింద ఏర్పాటు చేసిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ గదిని పరిశీలించి విద్యార్థినులు తయారు చేసిన వివిధ బొమ్మలను పరిశీలించారు. మొదటి విడతలోని 23 పాఠశాలల్లో పది కెమిస్ట్రీ ల్యాబ్‌లకు ఒక్కొక్కటి రూ.15.58 లక్షల నిధులతో పనులు పురోగతిలో ఉన్నాయని, 21 పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ఒక్కో స్కూల్‌కు రూ.5 లక్షల నిధులతో చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ శంకర్ రెడ్డి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, డిప్యూటీ డీఈఓ బాలాజీ, రాస్ కేవీకే హెడ్ డా.శ్రీనివాస్, సర్వశిక్షా ప్లానింగ్ అధికారి రామచంద్ర రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ విష్ణు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లోనూ అడ్మిషన్లు అంతంతే !

తిరుపతి సిటీ: ఎస్వీయూలో తొలివిడత పీజీ అడ్మిషన్ల పరిస్థితి విస్మయానికి గురి చేస్తోంది. ఏపీపీజీ సెట్-2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు గురువారం సాయంత్రం 5 గంటల్లోపు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. వర్సిటీలో తొలివిడత అడ్మిషన్లలో భాగంగా ఇప్పటివరకు ఆర్ట్స్ గ్రూపులకు సంబంధించి కనీసం 20 శాతం సీట్లు కూడా భర్తీ కాకపోవడం, మరికొన్ని కోర్సుల్లో సింగిల్ డిజిట్ అడ్మిషన్లు జరుగుతుండడంపై అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సైన్స్ విభాగాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సుల్లో 55 శాతం, ఫిజిక్స్‌లో 50 శాతం, కామర్స్ అండ్ కంప్యూటర్స్ విభాగాలలో 30 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో అయినా కనీసం 50 శాతం అడ్మిషన్లు భర్తీ అయ్యేనా అంటూ వర్సిటీ అధికారులు, విభాగాధిపతులు ఎదురు చూస్తున్నారు. పద్మావతి మహిళా వర్సిటీలో తొలివిడతలో సుమారు 60శాతం పైగా అడ్మిషన్లు జరిగాయి.

క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్సీ డిగ్రీ విద్యార్థులకు జువాలజీ(జంతుశాస్త్రం) బోధించడానికి ఎమ్మెస్సీ(జువాలజీ)లో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. అలాగే పీహెచ్‌డీ, యూజీసీ–నెట్, సెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 6303847064 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డిస్కంలో పదోన్నతులు

తిరుపతి రూరల్: దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) పరిధిలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సంస్థ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. పీఅండ్‌జీ విభాగంలో జనరల్ మేనేజర్‌గా ఉన్న ఎం గోపాలకృష్ణకు జాయింట్ సెక్రటరీగా పదోన్నతి కల్పిస్తూ కీలకమైన పీఅండ్‌జీ సర్వీస్ విభాగంలో నియమించారు. అలాగే డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఉన్న ప్రసాద్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి కల్పించి పీఅండ్‌జీ విభాగంలో నియమించారు. పర్సనల్ ఆఫీసర్లు శ్రీధర్, జీవీఎల్‌ఆర్ మూర్తికి డిప్యూటీ జనరల్ మేనేజర్లుగా పదోన్నతి కల్పించారు. వారిని తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో నియమించారు.

తిరుపతి డీపీటీఓకు అదనపు బాధ్యతలు


తిమ్మాడి చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డికి ఆర్టీసీలోని కడప జోన్–4 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా పూర్తి అదనపు బాధ్య తలు అప్పగించారు. కడప జోన్–4 పరిధిలోని 52 డిపోల పర్యవేక్షణ బాధ్యతలు ఆయనకు కేటాయించారు.

చికిత్స పొందుతూ ఉద్యోగి మృతి

తిరుపతి రూరల్: బైక్‌పై వెళ్తూ గేదె ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగి బుధవారం చనిపోయారు. తిరుపతి రూరల్ ఎస్‌ఐ షెక్షావలి తెలిపిన వివరాల మేరకు.. డీఆర్‌డీఏ డిపార్ట్‌మెంట్‌లో దినేష్‌బాబు ఏరియా కో–ఆర్డినేటర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 4వ తేదీన తుమ్మలగుంట రోడ్డులో బైక్‌పై వస్తుండగా మహిళా వర్సిటీ సమీపంలో గేదె వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో దినేష్ బాబు కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సీఎంసీలో గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం చనిపోయారు.

మూడు రాష్ట్రాల కూడలిగా ఉన్న కుప్పం టీడీపీ నేతల స్మగ్లింగ్‌కు అడ్డాగా మారింది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పంలో టీడీపీ శ్రేణుల దందాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఏ పని చేస్తే అధిక మొత్తంలో డబ్బులు వస్తాయో అటువంటి పనులను ఎంచుకుని చెలరేగిపోతున్నారు. గ్రానైట్, కృత్రిమ ఇసుక, తమిళ బియ్యం, జల్లికట్టు పందేలు నిర్వహిస్తూ రోజూ లక్షలాది రూపాయలు జేబులు నింపుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగే ఈ పనులన్నింటికీ సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా నియమించుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సహకారం మెండుగా ఉంది. ఈ చట్ట వ్యతిరేక కార్యకలాపాలన్నీ కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు పర్యవేక్షణలో సాగుతున్నట్లు టీడీపీ శ్రేణులు గొప్పగా చెప్పుకుంటున్నారు.

గ్రానైట్ తవ్వకాలతో పెద్దపెద్ద బావులను తలపిస్తున్న దృశ్యం



కుప్పంలో తమ్ముళ్ల దందాలు

- యథేచ్ఛగా గ్రానైట్ తవ్వకాలు
- 100 రోజుల్లో తరలిపోయిన వందలాది లారీల సంపద
- తమిళనాడుకు కృత్రిమ ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్న తమ్ముళ్లు
- పోరంబోకు భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- తమిళ రేషన్ బియ్యం అక్రమంగా తీసుకొచ్చి జోరుగా అమ్మకాలు
- మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా జల్లికట్టు.. రూ.లక్షల వసూళ్లు
- సీఎం చంద్రబాబు ముఖ్య అనుచరుడు కంచర్ల కనుసన్నల్లోనే దందా

సాక్షి టాస్క్‌ఫోర్స్: జిల్లాలోని కుప్పంలో లభ్యమయ్యే గ్రానైట్ పేరు కుప్పం గ్రీన్ అని పిలుస్తారు. గ్రానైట్ అడుగు విలువ రూ.40. తమ్ముళ్లకు కాసుల వర్షం కురిపించేందు కోసమే గ్రానైట్ తవ్వకాలపై ప్రస్తుత ప్రభుత్వం నిషేధం విధించింది. గ్రానైట్ తవ్వకాలు జరిపి తరలించడానికి వీల్లేదని చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. నిషేధం విధించక ముందు, ఎన్నికల కౌంటింగ్ ముగిసిన వెంటనే సుమారు 500 లారీల గ్రానైట్‌ని తరలించి సొమ్ముచేసుకున్నట్లు క్వారీల్లో పనిచేసే కార్మికులు చెబుతున్నారు. ఒక్కో లారీలో 50 టన్నుల నుంచి 60 టన్నుల గ్రానైట్‌ను తరలించినట్లు వెల్లడించారు. కర్ణాటక, తమిళనాడులో ఒక్కో లారీ గ్రానైట్‌ని రూ.1.50 లక్షల చొప్పున విక్రయించి సొమ్ముచేసుకున్నట్లు సమాచారం. నిషేధం విధించినప్పటికీ ప్రస్తుతం టీడీపీ నాయకులు ప్రతిరోజూ 20 నుంచి 30 లారీల గ్రానైట్‌ని అక్రమంగా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.

తమిళనాడు బియ్యంతో వ్యాపారం

తమిళనాడులో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేస్తున్న ఉప్పుడు బియ్యం కుప్పం టీడీపీ నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. తమిళ ప్రభుత్వం ప్రతి లబ్ధిదారునికి 5 కిలోల చొప్పున ఉచితంగా ఉప్పుడు బియ్యం పంపిణీ చేస్తోంది. ఈ బియ్యం తినటానికి ఇష్టపడని తమిళనాడు వాసులు కిలో రూ.5 చొప్పున స్థానిక వ్యాపారులకు విక్రయిస్తారు. ఇలాంటి బియ్యాన్ని ఏపీ రాష్ట్ర సరిహద్దు సమీపంలోని తమిళనాడు ప్రాంతాల నుంచి సేకరించి కర్ణాటకలోని బంగారుపేటకు రవాణా చేస్తున్నారు. ఒక్క టెంపో గమ్యం చేర్చితే కనీసం లక్ష రూపాయలు లాభం వస్తుంది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఈ వ్యాపారంలోకి దిగారు. బియ్యం సేకరణకు ఎవరికి వారు సొంత నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని, ఇదే వ్యాపారంలోని తమ వారిని ఇబ్బంది పెడుతూ తాము మాత్రమే ఎదిగేలా వ్యూహాలు అమలు చేస్తున్నారు. తమిళనాడులోని వాణియంబాడి, పచ్చూర్, నాట్రంపల్లి, తిమ్మంపేట్టై, ఆంబూర్, వరటనపల్లి ప్రాంతాల్లో కొందరు స్థానికులను బియ్యం సేకరణకు ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఏజెంట్లను సమన్వయం చేసుకోవటానికి ఆయా ప్రాంతాల వారీగా ఇన్‌చార్జిలను నియమించుకున్నారు. వీరు ఏజెంట్లతో మాట్లాడుతూ ఎవరు ఎంత బియ్యం సేకరించారో పర్యవేక్షిస్తూ వ్యాపారులకు సమాచారం ఇస్తారు. ఆయా గ్రామాల ఏజెంట్ల నుంచి బియ్యం తామే తీసుకురావాలంటే కిలోకు రూ.8 చెల్లిస్తారు. అదే రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసుకున్న స్టాక్ పాయింట్ల వద్దకు చేరిస్తే కిలోకు రూ.10 చెల్లిస్తారు. ఫోన్లతో వ్యవహారం నడిపే ఇన్‌చార్జిలకు కిలోకు రూ.1 చొప్పున చెల్లిస్తారు. సేకరించిన బియ్యాన్ని నడిమూరు, మల్లనూరు, నాయనూరు, గోవిందపల్లి, ఆరిమానుపెంట, పంద్యాలమడుగు, ముద్దనపల్లి మార్గాల మీదుగా వాహనాలతో తీసువస్తారు. కుప్పం నియోజకవర్గంలోని పోలీస్ సర్కిళ్ల మీదుగా వాహనాలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తారు. మొత్తం బియ్యాన్ని కర్ణాటకలోని బంగారుపేటలో మిల్లర్లు, వ్యాపారులకు కిలో రూ.24–రూ.26 వరకు విక్రయిస్తారు. టన్ను బియ్యం రూ.10 వేల లోపు కొనుగోలు చేసి దాన్ని రూ.26 వేల వరకూ విక్రయించటం ద్వారా ఒక్కో వాహనానికి రూ.1.50లక్షల వరకూ సంపాదిస్తున్నారు. అలా రోజు రూ.35–40 లక్షల విలువైన బియ్యం బంగారుపేటకు రవాణా చేస్తున్నారు. అలా తమిళనాడు బియ్యం లోడ్డుతో ఉన్న కంటైనర్ పోలీసులకు ఇటీవల పట్టుబడటం వెనుక టీడీపీ నేతల ఆధిపత్య పోరే కారణం. పంక్చర్ అయిన వాహనం కుప్పంలోని బైపాస్ రోడ్డులో ఆగి ఉందని, అందులో తమిళనాడు బియ్యం ఉందని ఓ టీడీపీ నాయకుడు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.


ఎన్నికల ముందు వరకు నిల్వ ఉన్న గ్రానైట్


రాత్రి సమయంలో గ్రానైట్ తరలిస్తున్న లారీలు

మరోవైపు కృత్రిమ ఇసుక

కుప్పంలో ప్రస్తుతం ఇసుక దొరకని పరిస్థితి. నిర్మాణాల కోసం ఇసుక తప్పనిసరి కావటంతో స్థానికులు కృత్రిమ ఇసుకను తయారు చేయడం ప్రారంభించారు. మట్టిని తీసుకొచ్చి ఓ చోట డంప్‌చేస్తారు. మట్టి దిబ్బలను పైపుల ద్వారా ఫోర్స్‌గా నీటిని పంప్‌చేస్తారు. ఆ నీటి వేగానికి మట్టి, ఇసుక వేరు అవుతాయి. ఆ ఇసుకతో నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఆ ఇసుకకు తమిళనాడులో మంచి డిమాండ్ ఉంది. ట్రాక్టర్ కృత్రిమ ఇసుక రూ.4వేలు చొప్పున తమిళులు కొనుగోలు చేసుకుంటున్నారు. కుప్పంలో కృత్రిమ ఇసుకను రూ.1,500 చొప్పున కొనుగోలు చేసి తమిళనాడులో రూ.4వేలకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. కృత్రిమ ఇసుక అక్రమ వ్యాపారంలోనూ టీడీపీ నేతలదే పెత్తనం. వారి కనుసన్నల్లో కృత్రిమ ఇసుక వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది.

జేబులు నింపుకునేందుకే జల్లికట్టు

కుప్పం తమిళనాడు, కర్ణాటక సరిహద్దు నియోజకవర్గం కావటంతో ఆ రాష్ట్ర ప్రజలకు జల్లికట్టు అంటే మహా ఇష్టం. వారి బలహీనతను టీడీపీ నేతల సొమ్ము చేసుకుంటున్నారు. జల్లికట్టు అంటే సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానికులు నిర్వహించుకునే ఆట. ఏడాదికి ఒక్క రోజు మాత్రమే నిర్వహిస్తుంటారు. అయితే కుప్పంలో మాత్రం వారానికి ఒక రోజు జల్లికట్టు నిర్వహిస్తున్నారు. జల్లికట్టు ఉందని సమాచారం ఇస్తారు. జల్లికట్టులో పాల్గొనే వారు ఒకరు రూ.4వేలు చెల్లించి తన ఎద్దుతో పందెంలో పాల్గొంటారు. పందెంలో గెలిస్తే రూ.లక్ష బహుమతి ఇస్తారు. మరి కొందరు విలువైన ద్విచక్ర వాహనాలు, వస్తువులు ఇస్తుంటారు. ఇలా టీడీపీ శ్రేణులు నిర్వహించే ఒక్కో జల్లికట్టుకు సుమారు 350 నుంచి 400 మంది వరకు పందెంలో పాల్గొంటారు. ఒక్కో పందెం ద్వారా సుమారు రూ.15 లక్షలు వసూలవుతుంది. అలా వసూలయ్యే మొత్తంలో సగం డబ్బు నిర్వహణ, బహుమతులకు ఖర్చు అయినా.. మరో సగం డబ్బులను టీడీపీ నేతలు జేబులు నింపుకుంటున్నారు. నియోజక వర్గంలో నిబంధనలకు విరుద్ధంగా సాగే వ్యవహారాలన్నింటికీ అర్బన్ సీఐ జీడీ నాయుడు సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రియల్ దందా


కుప్పంలో వెలసిన అక్రమ లే అవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

కుప్పం పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన అక్రమ లే అవుట్ల యజమానుల నుంచి టీడీపీ నేతలు మామూళ్లు వసూలు చేసుకుంటున్నారు. కుప్పం మున్సిపాలిటీతో పాటు నియోజక వర్గ పరిధిలోనూ అనేక అక్రమ లే అవుట్లు ఉన్నాయి. వాటి వివరాలు సేకరించిన టీడీపీ నేతలు యజమానులను పిలిపించుకుని లే అవుట్ సాఫీగా నడవాలంటే అడిగినంత ఇవ్వాలని, లేకపోతే అమ్మకాలు సాగనివ్వమని హెచ్చరించారు. దీంతో చేసేది లేక రియల్ ఎస్టేట్ వ్యాపారులు టీడీపీ నేతలు అడిగినంత సమర్పించుకున్నట్లు తెలిసింది. అందులో భాగంగా ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.20 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. టీడీపీ నేతలు ముడుపులు తీసుకున్న విషయం తెలియక మున్సిపల్ అధికారులు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన రాళ్లను తొలగించటం ప్రారంభించారు. టీడీపీ నేతలకు మామూళ్లు ఇచ్చినా ఇదేం అన్యాయమని అడగారు. రియల్ వ్యాపారి నుంచి నగదు తీసుకున్న టీడీపీ నేతలు ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎమ్మెల్సీ మున్సిపల్ కమిషనర్‌కి ఫోన్‌చేసి చెప్పటంతో రాళ్లను తొలగించటం నిలిపివేసి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైమ్: నగరంలో అక్రమంగా విక్రయిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. కొర్లగుంట మారుతి నగర్‌కు చెందిన సత్యపతి శ్రీనివాసరావు చెడు వ్యసనాలకు బానిసై అక్రమ మార్గంలో డబ్బు సంపాదనకు అలవాటు పడ్డాడు. ఇదే క్రమంలో ఏజెన్సీ ప్రాంతాల వారి నుంచి వారి వద్ద కేజీ రూ.10 వేలుకు కొనుగోలు చేశాడు. దాన్ని చిన్నచిన్న ప్యాకెట్లలో ఉంచి తిరుపతి రేణిగుంట పరిసర ప్రాంతాల్లో ఒక్కో ప్యాకెట్ రూ.300 చొప్పున విద్యార్థులకు, సాధువులకు అమ్మేందుకు ప్రయత్నం చేశాడు. బుధవారం మారుతి నగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విషయం బయటపడిందని సీఐ తెలిపారు. అతని వద్ద నుంచి 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

22 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 22 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 22 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.


వినాయక సాగర్‌లో క్రేన్ సాయంతో గణనాథుడి ప్రతిమను నిమజ్జనం చేస్తున్న దృశ్యం


వినాయకుడి ప్రతిమలను నిమజ్జనానికి తెస్తున్న పిల్లలు


ట్రాక్టర్‌లో ఊరేగింపుగా విగ్రహాన్ని తెస్తున్న యువత


దీవించు లంబోదరా..!


వినాయకుడి విగ్రహ నిమజ్జనం దృశ్యాలు

నిమజ్జనం.. పులకించిన భక్త జనం

తిరుపతి నగరంలోని వినాయక సాగర్ భక్తజనంతో పులకించిపోయింది. యువకుల కేరింతలు.. హోరింతలు.. గణపతి బొప్పా మోరియా అంటూ భక్తిభావంతో పరవశించిపోయింది. నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. సంప్రదాయంగా పూజలు చేసి, ఊరేగింపుగా తీసుకెళ్లి జలవనరుల్లో బొజ్జగణపయ్యను కలిపారు. – మంగళం


ఉండ్రాలయ్యను సాగనంపుతున్న భక్తులు


గౌరీ తనయా.. వెళ్ల రావయ్యా..

బరి తెగించిన టీడీపీ నేతలు

- చిన్నగొట్టిగల్లు సర్వసభ్య సమావేశంలో టీడీపీ మూకల హల్‌చల్
- ఎంపీపీ యుగంధర్‌రెడ్డిపై దాడికి యత్నం
- ఘర్షణలు జరగకుండా జాగ్రత్త పడిన పోలీసులు



సభను అడ్డుకుంటున్న టీడీపీ నేతలు, ఎంపీపీపై దాడిని అడ్డుకుంటున్న పోలీసులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం ఉద్రిక్తతల మధ్య జరిగింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సిన మండల మీట్ అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కోరం లేకపోవడంతో సభ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ వెంటనే అప్పుడే జెడ్పీ సీఈఓ నుంచి వచ్చిన మెసేజ్ ఆధారంగా సభ నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇద్దరు ఉన్నా సభ నిర్వహించుకోవచ్చని చెప్పడంతో సభ ప్రారంభించారు. అయితే టీడీపీ నాయకులు రమణారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి వచ్చి కోరం లేదు గనుక సభ జరగడానికి వీల్లేదంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి కలుగజేసుకుని జెడ్పీ సీఈఓతో మాట్లాడే సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపీపీపై దాడికి యత్నం

సమావేశం ముగించుకుని బయటకు వచ్చిన ఎంపీపీ యుగంధర్‌రెడ్డిపైకి ఒక్కసారిగా టీడీపీ మూకలు దాడికి యత్నించాయి. దీంతో అక్కడే ఉన్న పోలీసు బలగాలు అడ్డుకున్నారు. ఎన్నడూ లేనివిధంగా మండల కార్యాలయం వద్దకు టీడీపీ మూకలు చేరుకుని, అక్కడే భోజనాలు చేశారు. భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా ఆధ్వర్యంలో మరో సీఐ, ఎస్‌ఐలు, పోలీసులు, తిరుపతి నుంచి వచ్చిన బలగాలతో ఘర్షణలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఎంపీడీఓపై ఫైర్..

మండల మీట్ అనంతరం తన చాంబర్‌లోకి వచ్చిన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముట్టడించి నానా దుర్భాషలాడారు. కోరం లేకుండా సభ ఎలా నిర్వహిస్తావని, మినిట్స్ పుస్తకంలో సభ వాయిదా పడినట్లు రాయాలని పట్టుబట్టారు. దీంతో చేసేదేమీ లేక జెడ్పీ సీఈఓతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎంపీడీఓ చెప్పారు.